లిఫ్టులను నడిపి పండ్ల తోటలను రక్షించాలి

లిఫ్టులు, తూముల కింద యుద్ధ ప్రాతిపదికన చెరువులను నింపాలి

మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ, ఏప్రిల్ 5: నాగార్జున సాగర్ ఆయకట్టులో వెంటనే లిఫ్టులను నడిపించి ఎండిపోతున్న పండ్ల తోటలను రక్షించాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మిర్యాలగూడ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, తిప్పన విజయ సింహారెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్లనే రాష్ట్రంలో కరువు తీవ్ర పెరిగిందని అన్నారు. ఎడమకాల్వ లిఫ్టులు, తూముల ద్వారా యుద్ధ ప్రాతిపదికన చెరువులను నింపాలన్నారు. నీరు లేక ఎండిపోతున్న లక్షల ఎకరాల పండ్ల తోటలను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సాగర్ జలాశయంలో నీరు ఉన్నా వాటిని ఉపయోగించుకోకుండా రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించిందన్నారు. రైతులు ఎకరాకు రూ.20 నుంచి రూ.30 వేల పెట్టుబడులు పెట్టి వరి సాగు చేశారని, నీరు లేక పంటలు ఎండిపోయాయని, పెట్టిన పెట్టుబడి సైతం రాక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండిన పొలాలను పరిశీలించేందుకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కరీంనగర్, జనగాం, సూర్యాపేట, నల్లగొండ జిల్లాలో పర్యటించగానే ప్రభుత్వానికి వణుకు పుట్టి వెంటనే కాళేశ్వరం నీటిని ఎత్తిపోయించడం, ఎస్ఆర్ఎస్పీకి నీటిని వదలారని తెలిపారు.

జిల్లా మంత్రుల తెలివి తక్కువతనంతో పాలేరుకు నీరు

జిల్లా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేతగాని, తెలివి తక్కువ తనం వల్ల మన జిల్లాకు నీరు ఇవ్వకుండా ఖమ్మం జిల్లా పాలేరుకు నీటిని తీసుకెళ్లారని ఆరోపించారు. ఇప్పుడు కూడా మన జిల్లాకు నీరు ఇవ్వకుండా మళ్లీ రెండోసారి పాలేరు రిజర్వాయర్‌ను నింపేందుకు నీటిని తీసుకెళ్తున్నారని, ఎడమకాల్వపై ఉన్న విద్యుత్ లైన్లు నిలిపివేసి లిఫ్టులకు జంపర్లు కట్ చేసి మేజర్లు అన్ని సీజ్ చేశారని, ఇది జిల్లా ప్రజల నోరు కొట్టడమేనని విమర్శించారు. జిల్లాలో ప్రజలు తాగునీరు లేక ఇప్పటికే చాలా గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీరు తెచ్చుకునే పరిస్థితి దాపురించిందన్నారు. జిల్లా మంత్రులకు సోయి ఉంటే ఇప్పటికైనా ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో 41 లిఫ్టులకు వెంటనే నీటిని వదిలి చెరువులు, కుంటలను నింపాలని డిమాండ్ చేశారు. గోదావరి నది నుంచి వంద టీఎంసీ నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నా కూడా ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు.

ప్రతిపక్షాలను విమర్శించడమే సీఎం పని

ప్రభుత్వం ఏర్పాటు చేసిన నాటి నుంచి ముఖ్యమంత్రి, మంత్రులు ఎక్కడి నుంచి వసూలు చేయాలి, ఎప్పుడు ఢిల్లీకి పంపాలి అనే తపనతోనే ప్రభుత్వాన్ని నడుపుతున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ముఖ్యమంత్రి ఎంతసేపూ ప్రతిపక్షాలను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా శనివారం అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు, దీక్షలు చేపట్టనున్నట్లు, దీనికి రైతులు, బీఆర్ఎస్ అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నామిరెడ్డి యాదగిరిరెడ్డి, మట్టపల్లి సైదులుయాదవ్, రవినాయక్, హాతీరాం, నర్సింహారెడ్డి, చౌగాని భిక్షం, ఎండీ.షోయబ్ పాల్గొన్నారు.

నల్లగొండలో జడ్పీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి

దేవరకొండ :బాబు జగ్జీవన్‌రామ్ ఫ్లెక్సీకి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే బాలూనాయక్

నకిరేకల్: జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం, తదితరులు

మిర్యాలగూడ : రామచంద్రగూడెం వై జంక్షన్ వద్ద జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

ఘనంగా బాబు జగ్జీవన్‌రామ్ జయంతి

మాల్: చింతపల్లిలో కార్యాయలంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని శుక్రవారం జిల్లావ్యాప్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో, విగ్రహాల వద్ద ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. నకిరేకల్, దేవరకొండల్లో ఎమ్మెల్యేలు వేముల వీరేశం, నేనావత్ బాలూ నాయక్ పాల్గొని జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

-నమస్తే తెలంగాణ నెట్‌వర్క్

మాడ్గులపల్లిలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ శ్రీవిద్య

నార్కట్‌పల్లి : ఎంపీడీఓ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి

తిప్పర్తి : ఎంపీడీఓ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ విజయలక్ష్మి, కార్యాలయ సిబ్బంది

నల్లగొండ పట్టణంలోని ఎంజీయూలో నివాళులర్పిస్తున్న వీసీ నీహెచ్.గోపాల్‌రెడ్డి

గుర్రంపోడ్: ఎంపీడీఓ కార్యాలయంలో..

చిట్యాల: జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

పెద్ద అడిశర్లపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో..

నరేంద్రమోదీ, అమిత్‌షా జోడీతోనే దేశం అధోగతి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, ఏప్రిల్ 5 : నరేంద్ర మోదీ,అమిత్‌షా జోడీతోనే దేశం అధోగతి పాలైందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆరోపించారు. నకిరేకల్‌లోని పన్నాలగూడెం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం వికసిత్ భారత్ పేరుతో ప్రజలను బురిడి కొట్టించే ప్రయత్నం చేస్తుందన్నారు. వ్యవసాయరంగం సంక్షోభంలో ఉన్నంత కాలం భారతదేశం సంక్షోభంలో ఉంటుందని విశ్లేకులు అంటున్న మాటలను గుర్తుచేస్తున్నానన్నారు. 400 సీట్ల సాధిస్తామని చెబుతున్నా బీజేపీ నాయకులు ఆంధ్ర ప్రదేశ్‌లో టీడీపీ, జనసేనతో, బిహార్‌లో ములాయం సింగ్‌తో వంటి ప్రాంతీయ పార్టీలతో జతకట్టే పరిస్థితి ఎందుకు వస్తుందని నిలదీశారు. దేవుడి పేరుతో ఓట్ల రాజకీయం చేస్తున్నారని, ఢిల్లీ ముఖ్యమంత్రిని అక్రమంగా అరెస్ట్ చేశారన్నారు. ఉత్తరాదిలో బలహీనపడ్డారని, దక్షిణాదిలో ఆదరించే పరిస్థితి లేదన్నారు. ప్రజలు బీజేపీ మాయమాటలు నమ్మొద్దని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్‌రాష్ట్ర నాయకులు దైద రవీందర్, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్య, టీపీసీసీ మ్యానిఫెస్టో కమిటీ సభ్యుడు చామల శ్రీనివాస్, నాయకులు పన్నాల రాఘవరెడ్డి, వెంకన్న, కొండయ్య, సుకన్య, నరేందర్ పాల్గొన్నారు.

నేటి దీక్షను విజయవంతం చేయాలి

- మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్ , భాస్కర్‌రావు

మిర్యాలగూడ, ఏప్రిల్ 5 : సాగర్ ఎడమ కాల్వకు నీటిని విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం అందించడంతోపాటు, పండించిన వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలోశనివారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న దీక్షకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో తాగునీరు అందక ప్రజలు అల్లాడుతున్నారని, ప్రభుత్వం కనీసం ప్రజలకు తాగునీటికి అందించలేని దుస్థితిలో ఉందని పేర్కొన్నారు. నేడు ఆర్డీవో కార్యాల యం ఎదుట చేపట్టబోయే దీక్షకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పట్టణ, మండల అధ్యక్షులు, కార్యదర్శులు, రైతు, మహిళ, కార్మిక, యువజన, విద్యార్థి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విభాగాల అధ్యక్షులు, నాయకులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

ఎడమ కాల్వ నీటితో చెరువులు నింపాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

ఐలాపురంలో చెరువులో కూర్చోని నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ రూరల్, ఏప్రిల్ 5 : నాగార్జున సాగర్ ఎడమ కాల్వ చెరువులు నింపి నీటి ఎద్దడిని నివారించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మండలంలోని ఐలాపురంలో ఎండిపోయిన చెరువులో కూర్చోని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాగర్ నీటిని ఎక్కడో ఉన్న ఖమ్మం పాలేరు చెరువుకు తాగు నీటికోసం ప్రభుత్వం తరలిస్తుందని, అదే తాగే నీటి కోసం అల్లాడుతున్న జిల్లా ప్రజలకు మాత్రం ప్రభుత్వం చుక్కలు చూపిస్తుందని అన్నారు. వర్షాలు లేక, చెరవులు ఎండిపోయి భూగర్భ జలాలు లఅంతకంతకు అడుగంటి పోయి గ్రామాల్లోనూ గిరిజన తండాల్లో తాగు నీటికోసం ప్రజలు అల్లాడతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐలాపురం, గోప సముద్రంతండా, మైసమ్మకుంట తండా ప్రజలు తాగునీరు లభించక రెండు కిలో మీటర్ల దూరంలో ప్రవహిస్తున్న ఎడుమ కాల్వ మేజర్ నుంచి నీటి బిందెలతో మోస్తున్నారన్నారు. తాను బిందెలతో నీరు మోసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేశ్, వీరెల్లివెంకటేశ్వర్లు, రవి నాయక్, నాయకులు గడగోజు రాంమూర్తి, నాగేశ్వర్ ,శ్రీను, జగన్ ,నాగమ్మ, సునీత పాల్గొన్నారు.

ప్రజలు వడదెబ్బపై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ దాసరి హరిచందన

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

నల్లగొండ, ఏప్రిల్ 5: ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో జిల్లాలోని ప్రజలు వడదెబ్బకు గురికాకుండా పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని కలెక్టర్ దాసరి హరిచందన సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వేడిమి సంబంధ వ్యాధులపై జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ ఏడాది జిల్లాలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నాయని, వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఇప్పుడే 42.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైతున్న నేపథ్యంలో వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని జిల్లా ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రజలు బయటికి వెళ్లినప్పుడు శరీరం ఎండ వేడిమి తగలకుండా టోపీ ధరించాలని శరీరం నుంచి చెమట ఎక్కువగా పోవడం, వాంతులు, విరేచనాలు వంటివి సంభవిస్తే తక్షణమే ముందు జాగ్రత్త చర్యగా డాక్టర్ దగ్గరికి వెళ్లాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కూలీలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద పనిచేసే వారి కోసం తాగునీరు నీడ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. లోక సభ ఎన్నికలు మే నెలలో నిర్వహిస్తున్నందున ఓటు వేసేందుకు వచ్చిన ప్రజలు ఉష్ణోగ్రతల కారణంగా ఇబ్బందులు పడకుండా టెంట్లను ఏర్పాటు చేయాలని సూచించారు.

విద్యార్థులపై దృష్టి సారించాలి

జిల్లా సంక్షేమ శాఖ అధికారులు అందరూ వారి వారి పరిధిలోని సంక్షేమ హాస్టళ్లకు వెళ్లి పిల్లలు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై అవగాహన తీసుకురావాలన్నారు. అంతకుముందు డీఎంహెచ్ఓ డాక్టర్ కొండల్‌రావు మాట్లాడుతూ వడదెబ్బకు గురైన వారికి ప్రథమ చికిత్సగా ఇచ్చేందుకు ప్రతి ఆశ వర్కర్ దగ్గర 50, ఏఎన్ఎం వద్ద 100, ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో2000 ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ టి. పూర్ణచందర్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డీఆర్ఓ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

నీటి విడుదలకు రైతులు సహకరించాలి : ఈఈ సత్యనారాయణ

పెద్దఅడిశర్లపలి, ఏప్రిల్ 5 : సాగర్ నీటి మట్టం తక్కువ ఉన్న నేపథ్యంలో ఏఎమ్మార్పీ ప్రాజెక్టు నుంచి కేవలం జిల్లా, జంట నగరాలకు మాత్రమే తాగునీరు విడుదల చేస్తున్నామని నీటిని దుర్వినియోగం చేయకుండా రైతులు సహకరించాలని డివిజన్-4 ఈఈ జీజేవీ సత్యనారాయణ కోరారు. ప్రాజెక్టు పరిధిలోని అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, ఏఎమ్మార్పీ మెయిన్ కెనాల్, పుట్టంగండి పంపుహౌస్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పుట్టంగండి పుంపుహౌస్ లీకేజీలను అరికట్టేందుకు చేపడుతున్న గ్రౌటింగ్ పనులు వేగవంతం చేయాలని సూచించారు. ప్రస్తుతం ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ కు 800 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట డీఈ నాగయ్య, ఏఈలు శిల్ప, శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

వాసవీ క్లబ్ చర్లపల్లి కార్యాలయం ప్రారంభం

చర్లపల్లిలో నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న క్లబ్ జాతీయ నాయకులు

నల్లగొండ, ఏప్రిల్ 5: నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని వాసవీక్లబ్ చర్లపల్లి నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా క్లబ్ జాతీయ నేతలు యామదయాకర్, చిత్ర రవి చంద్రన్, రాచర్ల కమలాకర్‌పాల్గొన్నారు. ముందుగా చర్లపల్లిలో ఏర్పాటు చేసిన సంఘ భవనాన్ని ప్రారంభించి అనంరం నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా ఇమ్మడి వర ప్రసాద్, కార్యదర్శిగా విజయ్ కుమార్, కోశాధికారిగా కొండూరు తేజ, క్లబ్ సభ్యులుగా 8 మందిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ ప్రెసిడెంట్ గజవెల్లి సత్తయ్య, కార్యదర్శి బిక్కుమల్ల రవీందర్, కోశాధికారి గజవెల్లి యాదయ్యలతో పాటు క్లబ్ పూర్వ సభ్యులు, జిల్లా ఐపీసీ, ఐఈసీ, ఆర్సీ, జెడ్‌సి, వివిధ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మిర్యాలగూడలో జబర్దస్ బృందం సందడి

శాస్త్ర పాఠశాల వార్షికోత్సవంలో హాస్యంతో అలరిస్తున్న బృందం

మిర్యాలగూడ, ఏప్రిల్ 5: పట్టణంలో శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో జబర్దస్త్ బృందం సభ్యులు హైపర్ ఆది, కెవ్వు కార్తీక్‌తోపాటు మరికొందరు సందడి చేశారు. పట్టణంలోని శాస్త్ర పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా బృందం సభ్యులు హాజరై తమదైన హాస్యంతో పలువురిని ఆనందింపచేశారు. బృందాన్ని చూసేందుకు పట్టణ ప్రజలు భారీగా తరలివచ్చారు. అనంతరం పాఠశాల విద్యార్థులు నిర్వహించిన నృత్యాలు, పాటలతో పలువురిని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో విద్యా సంస్థల చైర్మన్ మైనం చంద్రశేఖర్, ఎంఈఓ బాలాజీనాయక్, కరస్పాండెంట్ పి.శ్రీధర్‌రెడ్డి, హెచ్ఎం సింధు, డి.మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు సత్యగ్రహ దీక్ష

చందంపేట(దేవరకొండ) : రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దేవరకొండ ఆర్టీసీ బస్టాండ్‌వద్ద శనివారం రైతు సత్యగ్రహం దీక్ష నిర్వహించనున్న ట్లు బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కరువు వల్ల పంట నష్టం పోయిన రైతులకు ఎకరానికి రూ.25వేలు అందజేయాలని పేర్కొన్నారు. రైతు సత్యగ్రహం దీక్షలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత

దేవరకొండరూరల్, ఏప్రిల్ 5 : మండలంలోని సపావట్‌తండాలో అక్రమంగా నిల్వ ఉంచిన 17 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సబావట్‌తండాలో కొండల్ ఇంట్లో సోదా చేయగా అక్రమంగా, తరలించేందుకు నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కొండల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

గుండ్రాంపల్లిలో వైద్య శిబిరం

చిట్యాల, ఏప్రిల్ 5 : గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, అమెరికా తెలుగు అసోసియేషన్ అధ్యక్షుడు బీ.మధు అన్నారు. గుండ్రాంపల్లి గ్రామంలో ఏసిరెడ్డి శ్రీరాంరెడ్డి, ఏసిరెడ్డి కృపాకర్‌రెడ్డి జ్ఞాపకార్థం చెన్నైకి చెందిన శంకర్ నేత్రాలయం, అమెరికా తెలుగు అసోసియేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్నిశుక్రవారం వారు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ అరుణకుమార్, ఆట సభ్యులు పాల్గొన్నారు.

చెరువులను నింపి ప్రజల దాహార్తిని తీర్చాలి

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి

సాగర్ ఎడమకాల్వను పరిశీలించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి

వేములపల్లి, ఏప్రిల్ 5: సాగర్ ఎడమకాల్వ నీటితో చెరువులను నింపి ప్రజల దాహార్తిని తీర్చాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సాగర్ ఎడమకాల్వను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రామాల్లో సాగు, తాగునీటి కోసం ప్రజలు అనేక పాట్లు పడుతున్నారని అన్నారు. వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్‌కి నీటిని పోలీసులు, రెవెన్యూ అధికారులతో తరలించుకోని వెళ్తుంటే మన జిల్లా నాయకులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కట్టా మల్లేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ చిర్ర మల్లయ్యయాదవ్, ఎంపీటీసీ నంద్యాల శ్రీరాంరెడ్డి, ఎంపీటీసీ సలహాదారు గడ్డం వెంకన్న, శెట్టిపాలెం గ్రామశాఖ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, రేగూరి రాము, గండబోయిన లక్ష్మయ్య, చల్లబొట్ల వెంకట్‌రెడ్డి, ఫక్కీరయ్య, పుట్టల సందీప్, పుట్టల పౌల్, రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి : డీఎస్ఓ

ఎస్ఎల్‌బీసీ ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలిస్తున్న డీఎస్వో, డీఎం

నల్లగొండ, ఏప్రిల్ 5: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాలని డీఎస్ఓ వెంకటేశ్వర్లు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. శుక్రవారం ఆయన సివిల్ సప్లయ్ డీఎం నాగేశ్వర్ రావు, ఆర్ఐ లింగస్వామితో కలిసి ఎస్ఎల్‌బీసీలోని ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలించి సెంటర్లలో మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. ప్రతి కేంద్రంలో తప్పని సరిగా నాలుగు నీటి కుండలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ప్రతి కేంద్రంలో నీడ కోసం షెడ్ ఏర్పాటు చేయాలని, తప్పనిసరిగా విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. వృద్ధ రైతులను ఎండ సమయంలో కేంద్రాల్లో ఉంచవద్దని, కేంద్రాల్లో ధాన్యం ఉదయం 5 నుంచి 11 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 8 గంటల సమయంలోనే కొనుగోలు చేయాలని సూచించారు. ఇప్పటి వరకు జిల్లాలో 266 కేంద్రాలు ప్రారంభించి 6,448 మెట్రిక్ టన్నుల ధాన్య కొనుగోలు చేసినట్లు తెలిపారు. అలాగే రైతుల ఖాతాల్లో రూ.40లక్షలు జమ చేసినట్లు పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

FLAT FOR SALE
★Ready to Move: Hayathnagar Near Vijayawada Highway Beside Bus Stop Sup. Luxurious 3BHK Flats, 2 Side 30' Rd. Ph: 9247326642 / 9849801477.
NT-327957

FLAT FOR SALE
★Ready to move: 3BHK Flats for Sale, 1900 Sft. @ Medipally Near Warangal Highway. Contact: 6300623310, 6302061711.
NT-717

WANTED
★Wanted Agents, Associates Franchise throughout Telangana for Abroad Medical College Admission. 8881116865 / 8881115253.
NT-311882-All

PLOT FOR SALE
★HMDA Approved Affordable Plots for Sale Near AIIMS, Bibi Nagar, 160 to 200 Sq.yds. Contact: 6300623310, 6302061711.
NT-720

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines, Extra Line - Extra Amount
5% GST అదనం
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777196 | పోచంపల్లి : 9182777638